సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 24 । జూన్ । 2025



అంతా పకడ్బందీగా..
అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. 8లో



వాటాధనం నుంచి వాటా..
రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పీఏసీఎస్‌లకు వాటాధనంలో కొంత మేర చెల్లించాలని డీసీసీబీ నిర్ణయించింది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 26°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉదయం వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఆకాశంలో మబ్బులు కమ్మేయవచ్చు.

న్యూస్‌రీల్

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి



నూతన సీహెచ్‌పీ స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో వీకే–7ఓసీ గనికి అన్ని రకాల అనుమతులు లభించిన నేపథ్యంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, ఈ ఏడాది కంపెనీ నిర్దేశించిన 10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కొత్తగూడెం ఏరియాలోని వీకే–7 ఓసీ, రైల్వే సైడింగ్ పనులపై సమీక్షించారు. ఓసీకి కేటాయించిన స్థలాన్ని, నూతన సీహెచ్‌పీని పర్యవేక్షించారు. అనంతరం ఏరియా అధికారులతో మాట్లాడుతూ రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ, బ్లాస్టింగ్, లోడింగ్ పనుల వివరాలను జీఎంను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు నాణ్యత సామర్థ్యం పెంచేలా చూడాలని సూచించారు. తొలుత ఏరియా జీఎం శాలెంరాజు తదితరులు డైరెక్టర్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జీఎం వెంకటేశ్వర్లు, ఏజీఎం రామకృష్ణ, జీకే ఓసీ పీఓ శ్రీ.రమేష్, తావురియా తదితరులు పాల్గొన్నారు.

రైతు సదస్సు వీక్షణకు ఏర్పాట్లు చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతు భరోసా రూ.9 వేల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా ప్రభుత్వం సచివాలయం వద్ద మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే రైతు సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వీడియో సౌకర్యం ఉన్న 58 రైతు వేదికల్లో రైతులు సదస్సును వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులు కూడా హాజరయ్యేలా చూడాలని, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. హాజరైన రైతుల వివరాలు నమోదు చేసి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

పంట చేలల్లో ఆశల మొలకలు

రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా తేలికపాటి వానలు
- పత్తి పంట, వరినారుకు జీవం పోసిన వర్షపు జల్లులు
- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లకు రైతు 'భరోసా'
- మరింత ముమ్మరం కానున్న సాగు పనులు



వర్షపు జల్లులకు చిగురించిన పత్తి మొక్కలు

బూర్గంపాడు: మృగశిర కార్తెలో ముఖం చాటేసిన వరుణుడు ఆరుద్రలో కరుణించాడు. ఈ నెల 22న ఆదివారం నుంచి ఆరుద్ర కార్తె ఆరంభంకాగా, తొలిరోజు నుంచే జిల్లాలో వర్షపు జల్లులు మొదలయ్యాయి. ఆరుద్ర కురిస్తే ఆరు కార్తెలు కురుస్తాయని సామెత. సోమవారం జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వానలు కురిశాయి. దీంతో పత్తి మొక్కలు, వరినార్లు జీవం పోసుకున్నాయి. పది, పదిహేను రోజుల క్రితం నాటిన విత్తనాలు కూడా మొలకెత్తుతున్నాయి. వరినార్లకు మొలకలు వస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు.

పొడి దుక్కుల్లోనే విత్తనాలు

ఈ ఏడాది మేలో అకాల వర్షాలు కురవటంతో భూములు పదునయ్యాయి. దీంతో రైతులు అప్పుడే దుక్కులు చేసుకుని పంటల సాగుకు భూములు సిద్ధం చేశారు. ఈ నెల మొదటి వారంలోనే చాలామంది పొడి దుక్కుల్లో పత్తి గింజలు వేశారు. 5న కురిసిన ఓ మోస్తరు వర్షానికి అక్కడక్కడా పత్తి గింజలు మొలకలు వచ్చాయి. ఆ తర్వాత 15 రోజులపాటు చినుకు పడలేదు. దీనికి తోడు ఎండల తీవ్రత పెరగడంతో పత్తి మొక్కలు వడలిపోయాయి. కొన్నిచోట్ల మొక్కలను కాపాడుకునేందుకు రైతులు బిందెలతో నీళ్లు పోశారు. మరికొన్నిచోట్ల మొలకలు రాకపోవటంతో రెండోసారి పత్తి గింజలు విత్తారు. ఈ నెల రెండో వారంలో పోసిన వరినార్లు కొంత మొలకలు వచ్చి, కొంత మొలకలు రాలేదు. ఈ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేశాయి. వాన కోసం రైతులు మూడు వారాలుగా ఎదురుచూస్తున్నారు. శనివారం రాత్రి



వర్షానికి పచ్చబడిన వరినారు

నుంచి జిల్లాలో అక్కడక్కడా వర్షపు జల్లులు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి జిల్లావ్యాప్తంగా జల్లులు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి జిల్లాలో చిరు జల్లులు పడుతుండటం పంటలకు జీవం పోసింది. వర్షాలు ఆలస్యం కావటంతో ఈ ఏడాది పంటల సాగు రెండువారాలు ఆలస్యమైంది.

2.25 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో ఈ ఏడాది 2.25 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా. ఇప్పటికే 1.05 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టారు. మిగిలిన రైతులు ఈ వారంలో విత్తనాలు వేసే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర పెంచటం, మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో ఈ ఏడాది జిల్లాలో పత్తిసాగు గణనీయంగా పెరగనుంది. ఇక ఖరీఫ్‌లో 1.95 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులు వరినార్లు పోసుకున్నారు. కొన్నిచోట్ల వరి నార్లు మొలకలు వచ్చాయి. మోటార్ల కింద రైతులు వరినార్లకు నీరు పెట్టి నారు పెంచుతున్నారు. భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితే వరి నాట్లు షురువవుతాయి. బోర్ల కింద జూలై మొదటివారం నుంచి వరినాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మిర్చికి రేటు పడిపోవటంతో రైతులు విముఖత చూపుతుండటంతో ఈ ఏడాది జిల్లాలో మిర్చి సాగు పడిపోనుంది.

అందిన భరోసా.. సాగుకు ఊతం

రైతులు పెట్టుబడులకు వెతుకులాడుకోకుండా రైతు భరోసా అందించటం కూడా పంటల సాగుకు ఊతమిచ్చినట్లయింది. జిల్లాలోని రైతులందరికీ దాదాపుగా రైతు భరోసా పెట్టుబడి సాయం అందింది. దీంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ఎరువుల కొరత ఉంటుందనే ప్రచారంతో చాలామంది రైతులు రైతు భరోసా నగదుతో ముందస్తుగానే యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ మొక్కలపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి ఆదేశం



ఎస్టీ కమిషన్ విచారణకు హాజరైన రైతులు, అధికారులు

అశ్వారావుపేట: ఉమ్మడి జిల్లాలోని అశ్వారావుపేట, సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీల ద్వారా రైతులకు పంపిణీ చేసిన ఆయిల్‌పామ్ మొక్కలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జాతీయ ఎస్టీ కమిషన్ సూచించింది. ఈ రెండు నర్సరీల ద్వారా ఇచ్చిన మొక్కల్లో ఆఫ్‌టైప్ రావడంతో రూ.లక్షల్లో నష్టపోయామని పలువురు రైతులు ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం హైదరాబాదులో ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ విచారణ చేపట్టారు. ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ అధికారులతో పాటు బాధిత రైతులు హాజరవగా 2016 – 2022 మధ్యలో పంపిణీ చేసిన ఆయిల్‌పామ్ మొక్కల ఎదుగుదల, దిగుబడిపై సమగ్ర నివేదిక నెలలోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలు సందర్శనకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. విచారణకు ఉద్యానశాఖ కమిషనర్ యాస్మిన్ బాషా, ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్య, ఓఎస్డీ అడప కిరణ్, ప్రవీణ్‌రెడ్డి, రైతులు కారం శ్రీరాములు, మడివి బాలరాజు, కొండ్రు మురళి, చెలికాని వెంకట్, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

పరుగును ప్రారంభించిన కలెక్టర్ జితేష్, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంటౌన్: అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడాజ్యోతితో పరుగులు పెట్టారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొత్తగూడెం సూపర్‌బజార్ వద్ద రన్ ప్రారంభించి బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ మీదుగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జిల్లా కేంద్రంలో 50 ఎకరాల్లో కొత్త స్టేడియం



ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్, ఎమ్మెల్యే కూనంనేని

నిర్మిస్తామని తెలిపారు. క్రీడల్లో రాణించే యువతను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, క్రీడా సంఘాల బాధ్యులు సాబిర్ పాషా, నాగా సీతారాములు, కొత్వాల శ్రీనివాసరావు, కె.మహీధర్, యుగంధర్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, డాక్టర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన అర్జీలను స్వీకరించారు. సంబంధిత యూనిట్ అధికారులకు ఎండార్స్ చేసి, పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ఆదివాసీ గ్రామాల్లో బ్లీచింగ్, శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అర్జీలు, పరిష్కార వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఇప్పించాలని చర్ల మండలం మామిడిగూడెం గ్రామానికి చెందిన సమ్మయ్య ఫిర్యాదు చేశారు. ఎల్‌టీఆర్ భూ సమస్య పరిష్కరించాలని గుండాల మండలానికి చెందిన వెంకయ్య విన్నవించారు. సౌర విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని సింగరేణి మండలం గేట్ కారేపల్లికి చెందిన శాంత, గురుకులంలో సీటు ఇప్పించాలని ఏన్కూర్‌కు చెందిన నిహారిక వినతిపత్రాలు అందించారు. ఉద్యోగం కల్పించాలని కూసుమంచికి చెందిన నవ్య, సోలార్ ప్యానల్ ఇప్పించాలని గార్ల మండలం గాజుల తండాకు చెందిన సరోజ, బోరుబావికి అనుమతి ఇవ్వాలని బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రమ విన్నవించారు. నూతన మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలని సూర్యాతండాకు చెందిన 16 మంది అర్జీ పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డేవిడ్ రాజ్, హరీష్, అరుణ కుమారి, రవీంద్రనాథ్, వేణు, లక్ష్మీనారాయణ, ఉదయకుమార్, ఆదినారాయణ, లింగా నాయక్ పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

ప్రజావాణికి తగ్గిన రద్దీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల తరచూ ఏదో ఒక కారణంతో ప్రజావాణి కార్యక్రమాలు వాయిదా పడుతుండటంతో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు ఎక్కువగా హాజరు కాలేదు. దీనికితోడు చెదురు ముదురుగా వర్షాలు పడుతుండటం, గ్రామీణ ప్రాంతాల్లో వానాకాలం సాగు పనులు ప్రారంభం కావడంతో జనం ఎక్కువ సంఖ్యలో రాలేదు. ప్రజావాణికి హాజరైన అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ వివిధ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల్లో కొన్నింటి వివరాలు..

- కుటుంబ పోషణ కోసం ఉద్యోగం ఇప్పించాలని పదో తరగతి చదివిన, పాల్వంచకు చెందిన బధిరురాలు మడిపల్లి నందిని వినతిపత్రం అందజేయగా, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్‌కు ఎండార్స్ చేశారు.
- తమ గ్రామంలో సంత ఏర్పాటుకు బూర్గంపాడు ఎంపీడీఓ, పోలీసులకు దరఖాస్తు చేసినా స్థల పరిశీలనలో జాప్యం చేస్తున్నారని, త్వరితగతిన పరిశీలన చేపట్టి, సంతకు అనుమతి ఇచ్చేలా చూడాలని బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దుర్గాల వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయగా, దరఖాస్తును కలెక్టరేట్ ఓఎస్‌డీకి ఎండార్స్ చేశారు.
- అశ్వాపురం మండలం నెల్లిపాక రెవెన్యూ సర్వే నంబర్ 433/8లోని 30 కుంటల భూమిని 2019లో కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని, తన పేరుమీద పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని బీజీ కొత్తూరు గ్రామానికి చెందిన మర్రి కృష్ణారెడ్డి దరఖాస్తు చేయగా, అశ్వాపురం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ఆదివాసీలు ఆర్థికంగా ఎదగాలి

కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రత్యేకాధికారి సుభాష్

అశ్వారావుపేటరూరల్/ములకలపల్లి: గిరిజనులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రత్యేకాధికారి సుభాష్ సూచించారు. సోమవారం ఆయన ములకలపల్లి మండలం మూకమామిడిలో, అశ్వారావుపేట మండలం రెడ్డిగూడెం, తిరుమలకుంట, గోగులపూడి గ్రామాల్లో నిర్వహించిన ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ యోజన సదస్సులకు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు వ్యక్తిగత గుర్తింపు కార్డులు అవసరమని, అందుకోసమే గ్రామాల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గిరిజన రైతుల పంట పొలాలకు విద్యుత్, బోరు, మోటారు ఏర్పాటుకు సబ్సిడీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొండరెడ్ల, ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు, రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. గోగులపూడి గ్రామంలో కొండరెడ్ల గిరిజనులు వెదురుతో తయారీ చేసిన కళాఖండాలను పరిశీలించారు. ములకలపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి బోధనాతీరుపై ఆరా తీశారు. అధికారులు సున్నం రాంబాబు, భాస్కర్‌రావు, గద్దె రేవతి, భాగ్యలక్ష్మి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, సంపత్‌కుమార్, సురేశ్‌కుమార్, వరప్రసాద్, గఫూర్ పాషా, శివరాంప్రసాద్, మధులిక, రాందాస్ నాయక్, బాపనయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుభాష్

DCCB KHAMMAM ది జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం.
రి.నెం.1384

బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949 సెక్షన్ 29 మరియు 31 ప్రకారము

31-3-2025 నాటి ఆస్తి అప్పుల పట్టిక

వ.నెం.	అప్పులు	మొత్తం	వ.నెం.	ఆస్తులు	మొత్తం
1	వాటా ధనము	1,58,12,06,002.89	1	నగదు	39,66,37,162.00
2	రిజర్వులు	51,81,62,174.71	2	బ్యాంక్ నిల్వలు	2,13,89,70,956.38
3	డిపాజిట్లు	12,65,23,45,024.24	3	పెట్టుబడులు	2,80,40,85,931.71
4	తెచ్చిన అప్పులు	12,32,32,95,551.62	4	రావలసిన అప్పులు	21,95,10,71,859.44
5	ఇతర అప్పులు /ప్రొవిజన్	1,36,43,51,165.03	5	స్థిరాస్తులు	32,17,37,166.31
6	ఆస్తి అప్పుల వ్యత్యాసము	5,30,55,432.33	6	ఇతర ఆస్తులు	87,04,09,739.45
			7	డిఫర్డ్ ట్యాక్స్ ఎసెట్	95,02,535.53
	మొత్తం	28,49,24,15,350.82		మొత్తం	28,49,24,15,350.82

31-3-2025 నాటి లాభ, నష్టముల ఖాతా

వ.నెం.	వ్యయము	మొత్తం	వ.నెం.	ఆదాయం	మొత్తం
1	చెల్లించిన వడ్డీ	1,36,96,49,893.06	1	వసూలైన వడ్డీ	1,97,88,27,488.44
2	సిబ్బంది ఖర్చులు	39,83,30,355.74	2	ఇతర ఆదాయం	15,21,66,963.40
3	ఇతర ఖర్చులు	27,57,87,405.82			
4	తరుగుదల	2,04,64,646.89			
5	నికర లాభం 2024-25	6,67,62,150.33			
	మొత్తం	2,13,09,94,451.84		మొత్తం	2,13,09,94,451.84

సం/- ఎస్.వెంకట ఆదిత్య
ముఖ్య కార్యనిర్వాహణాధికారి (ఇ/సి)
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లి॥, ఖమ్మం.

సం/- యల్.మహేష్
మెస్సర్స్ రామనాథం & రావు
చార్టర్డ్ అకౌంటెంట్ మెంబర్‌షిప్ నెం.212851

Opinion:
We have audited the accompanying Financial Statements of **The District Co-operative Central Bank Limited, Khammam** ("the Bank"), which comprises the Balance Sheet as at **March 31, 2025**, the Statement of Profit and Loss, for the year ended on that date and a summary of significant accounting policies and other explanatory information.
The Balance Sheet, Profit and Loss Account statement have been drawn up in Forms A & B respectively of the Third Schedule to The Banking Regulation Act, 1949 (as applicable to the Co-operative Societies/ Co-operative Banks).

We report that:
a) We have obtained all the information and explanations, which to the best of our knowledge and belief were necessary for the purpose of our audit and have found to be satisfactory;
b) In our opinion, proper books of account as required by law have been kept by the Bank so far as it appears from our examination of those books and proper returns adequate for the purposes of our audit have been received from the branches/offices;
c) The transactions of the Bank which came to our notice have been within the powers of the Bank;
d) The Bank does not have any pending litigation which would impact its Financial position;
e) The Bank did not have any long-term contracts including derivative contracts for which they were any material foreseeable losses under the applicable law or accounting standards.
f) The Balance Sheet and the Profit and Loss Account together with schedules dealt with by this report, are in agreement with the books of account and the returns;
g) The Accounting Standards adopted by the Bank are consistent with those laid down by accounting principles generally accepted in India so far as applicable to Banks except as reported in the Annexure hereto or in Notes forming part of this accounts.
h) In our opinion and according to information and explanations given to us, we have not noticed any material impropriety or irregularity in the expenditure or in the realization of money due to the bank.

Place : HYDERABAD
Date : 18-06-2025
UDIN 23212851BGWJRL5027

For Ramanadham & Rao
CHARTERED ACCOUNTANTS
Firm Reg No.002934S
L. MAHESH KUMAR, Partner
MEMBERSHIP NO. 212851

అరకొర వసతులే!

- స్థాపించి నాలుగేళ్లయినా అసంపూర్తిగా భవనాల నిర్మాణం
- వెంటాడుతున్న అధ్యాపకులు, సిబ్బంది కొరత
- ఇదీ కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల దుస్థితి
- ఈ నెల 25 నుంచి కళాశాలలో ప్రత్యేక కమిటీల తనిఖీ



కొనసాగుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు

మెడికల్ కళాశాలలో సిబ్బంది వివరాలు..

	పోస్టులు	ఉండాల్సింది రెగ్యులర్	ఉన్నది కాంట్రాక్ట్
ప్రొఫెసర్	41	10	01
అసోసియేట్ ప్రొఫెసర్	51	05	--
అసిస్టెంట్ ప్రొఫెసర్	139	32	08
ట్యూటర్లు	31	--	13
సీనియర్ రెసిడెంట్ డాక్టర్	76	18	--
అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్	01	--	--
సీనియర్ అసిస్టెంట్	01	--	-
టెక్నీషియన్లు	24	--	--
ఔట్ సోర్సింగ్ సిబ్బంది	75		

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కరోనా సంక్షోభం తర్వాత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విరివిగా మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. వైద్యకళాశాలకు అనుమతులు సాధించడంలో చూపించిన శ్రద్ధ కాలేజీ భవనాల నిర్మాణం, సిబ్బందిని భర్తీ చేయడంలో చూపించడంలేదు. దీంతో కొద్దిమంది అధ్యాపకులతో అద్దె భవనాల్లో కళాశాలలు కొనసాగుతున్నాయి. ఈ దుస్థితిపై ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కొత్త మెడికల్ కాలేజీల పరిస్థితులపై అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పది ప్రత్యేక కమిటీలను నియమించింది. ఈ నెల 25 నుంచి 29 వరకు కమిటీ సభ్యులు కళాశాలలను సందర్శించి, పరిశీలించి 30న ప్రభుత్వానికి నివేదిక అందివ్వనున్నారు.

నాలుగో బ్యాచ్ వచ్చేస్తోంది

జిల్లాకు 2021లో 150 సీట్లతో వైద్యకళాశాల మంజూరైంది. మొదటి బ్యాచ్ విద్యార్థులు 2022 నవంబరులో చేరారు. ఈ ఏడాది కౌన్సెలింగ్ పూర్తయితే నాలుగో బ్యాచ్ విద్యార్థులు కూడా చేరతారు. మొదటి బ్యాచ్ విద్యార్థులు ఫైనలియర్‌కు చేరుకుని జూనియర్ డాక్టర్ హోదా పొందుతారు. మొత్తంగా ఈ ఏడాది చివరి నాటికి మెడికోలు సుమారుగా 600 మంది, టీచింగ్ స్టాఫ్ రెండు వందల మంది, సపోర్టింగ్ స్టాఫ్‌తో కలుపుకుని దాదాపుగా వెయ్యి మందికి అనువుగా మెడికల్ కాలేజీకి భవనాలు, హాస్టళ్లు, ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు, ఆఫీస్ స్టాఫ్ ఇలా అన్ని రకాల సౌకర్యాలు సమకూరాల్సి ఉంది.

సమస్యల చిట్టా

ప్రస్తుతం కాలేజీ భవనాలు, బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లు, మెస్, రెసిడెంట్ డాక్టర్ల క్వార్టర్లు నిర్మాణంలో ఉన్నాయి. భవనాలు లేకపోవడంతో పాల్వంచలోని వేర్వేరు చోట్ల గర్ల్స్, బాయ్స్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. హాస్టల్ మెస్‌లో పెట్టే భోజనం నాణ్యతగా లేదంటూ గతేడాది వివాదం చోటు చేసుకుంది. హాస్టల్ నుంచి కాలేజీకి, కాలేజీ నుంచి జనరల్ ఆస్పత్రికి వెళ్లేందుకు రవాణా విషయంలోనూ ఇబ్బందులు ఉన్నాయి. ఇటీవల మెడికల్ కాలేజీ విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోకు ప్రమాదం జరగడంతో మెడికోలు గాయపడ్డారు. 'భద్రాద్రి కొత్తగూడెం' తరహాలోనే రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో స్టాఫ్ లేకపోవడం, భవనాల నిర్మాణం పూర్తి కాకపోవడంపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఎన్‌ఎంసీ ఎఫెక్ట్... మొదలైన పనులు

మెడికల్ కాలేజీకి హాస్టల్, తరగతి గదులు, మెస్, రెడిసెండ్ డాక్టర్ల క్వార్టర్లు తదితర తొమ్మిది రకాల భవనాల నిర్మాణం జరుగుతోంది. అకడమిక్ క్లాసులు నిర్వహించే భవనం జీ ప్లస్ 4, బాల, బాలికల హాస్టళ్లు జీ ప్లస్ 5 పద్ధతిలో నిర్మించాల్సి ఉంది. మెస్, స్టాఫ్ క్వార్టర్స్ జీ ప్లస్ 2 గా నిర్మించాల్సి ఉంది. 2023 ఆరంభంలో పనులు మొదలవగా 2024 డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉంది. కానీ నిధుల విడుదలలో జాప్యం కారణంగా నిర్మాణ పనులు ఆగుతూ సాగుతున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు శ్లాబ్ దశకు చేరుకోగా నిధుల సమస్య తలెత్తడంతో గత మార్చిలో పనులు ఆపేశారు. ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పనులు మళ్లీ మొదలుపెట్టారు. భవన నిర్మాణ కార్మికులు, యంత్రాలు తిరిగి కాలేజీ దగ్గరకు చేరుకుంటున్నాయి.

క్లుప్తంగా

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

వైభవంగా రుద్రహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం అమ్మవారికి రుద్రహోమం పూజలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని యాగశాలలో రుద్రహోమం పూజలు చేశారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజలు, రుద్రహోమం గావించారు. చివరన పూర్ణాహుతి జరిపారు. రుద్రహోమం పూజలో పాల్గొన్న ముగ్గురు దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్ చెవుగాని పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి వేయి సంతకాలతో వినతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): పెన్షనర్లకు తీవ్ర నష్టం కలిగించే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ప్రధా నమంత్రి మోదీకి వేయి సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈజీఆర్ వెస్లీ, ఆర్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టీజీఈ జేఏసీ కన్వీనర్ ఎస్.వెంకటపుల్లయ్య, చైర్మన్ రామారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం జీపీ నాయకులగూడెం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్తీ ఉదయ్ (21) మృతి చెందాడు. మాణిక్యారం గ్రామానికి చెందిన ఉదయ్, అతని స్నేహితులు ప్రభాస్, వినీత్‌రాజ్ ముగ్గురు బైక్‌పై ఇల్లెందు నుంచి మాణిక్యారం వెళ్తుండగా నాయకులగూడెం స్టేజీ వద్ద గేదెను ఢీకొట్టారు. డ్రైవింగ్ చేస్తున్న ఉదయ్ తీవ్రంగా గాయపడగా, అతని స్నేహితులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గేదె అక్కడికక్కడే మృతి చెందింది. 108 ద్వారా క్షతగాత్రులను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయ్ మృతి చెందాడు. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతా పకడ్బందీగా..

- అంగన్‌వాడీ సరుకులు పక్కదారి పట్టకుండా ఏర్పాట్లు
- సెంటర్లలో ఫేషియల్ రికగ్నైజేషన్
- మొదటగా చిన్నారుల తల్లులకే..
- వచ్చే నెల 1 నుంచి అమలు



కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రంలో చిక్కీలు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. తల్లుల ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయాలని భావిస్తోంది. ఆరు నెలలుగా మూడేళ్ల చిన్నారులకు అందించే బాలామృతం, గుడ్ల పంపిణీకి మాత్రమే దీనిని వినియోగిస్తోంది. ఇందుకు ఫోన్ ట్రాకర్ యాప్‌లో తల్లుల ముఖ గుర్తింపు నమోదు చేస్తోంది. ప్రస్తుతం పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ఫేషియల్ రికగ్నైజేషన్ విధానం అమలులోకి తెచ్చేందుకు నిర్ణయించింది. దీంతో అంగన్వాడీ కేంద్రాల్లో ఈ ప్రక్రియ జూలై 1 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జూలై 1 నుంచి పకడ్బందీగా..

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,061 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 30,654 మంది, 3 – 6 ఏళ్ల మధ్య వారు 26,635 మంది ఉన్నారు. వీరితో పాటు 6,429 మంది గర్భిణులు, 5,825 మంది బాలింతలు ఉన్నారు. ప్రస్తుతం 192 టీచర్, 961 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఫేషియల్ రికగ్నైజేషన్ నమోదు తప్పనిసరి చేసింది. సరుకులు పక్కదారి పట్టకుండా ఈ ప్రక్రియ అమలు చేయనుంది. ఈ మేరకు కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలోని అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏప్రిల్ నుంచే ఈ ప్రక్రియ కొనసాగుతుండగా.. కొందరికి ఫోన్ ట్రాకర్ పనిచేయక పోగా.. దీన్ని వచ్చే నెల నుంచి పకడ్బందీగా అమలు చేయనున్నారు. యాప్‌ను సైతం అప్‌డేట్ చేశారు.

ఇప్పటివరకు చిన్నారులకే..

ఫేషియల్ రికగ్నైజేషన్ విధానం ఆరు మాసాల వారి నుంచి మూడేళ్ల చిన్నారులకు పంపిణీ చేసే అదనపు ఆహారమైన బాలామృతం, గుడ్ల పంపిణీకి మాత్రమే ఇప్పటివరకు వర్తించేది. మూడేళ్లలోపు చిన్నారులకు ఇంటికి ఇచ్చే పోషకాహారాన్ని రిజిస్ట్రేషన్ అయిన తల్లి లేదా తండ్రి ఫొటోను ఫోన్లో నమోదు చేసి పంపిణీ చేస్తారు. ప్రస్తుతానికి నమోదు ఇదొక్కటే అయినప్పటికీ రానురాను అన్ని సరుకులను ఫేషియల్ రికగ్నైజేషన్ ప్రక్రియ ద్వారా పంపిణీ చేయనున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఈ విధానం ద్వారానే అందించనున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు..

అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే అన్ని రకాల సరుకులు, పోషకాహారం పంపిణీ చేసే సమయంలో ఫేస్ రికగ్నైజేషన్ తప్పనిసరి చేయడంతో చిన్నారుల తల్లులు, ఇటు బాలింతలు, గర్భిణులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారులకు అందాల్సిన అన్ని సరుకులు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా చేరుతాయని పేర్కొంటున్నారు.

అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం



ఫేషియల్ రికగ్నైజేషన్ విధానాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అమలయ్యేలా చూస్తాం. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల్లో మూడేళ్లలోపు చిన్నారులకు గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు అందించే సమయంలో ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా నమోదు చేస్తున్నాం. జూలై 1 నుంచి బాలింతలు, గర్భిణులకు కూడా ఫేస్ రికగ్నైజేషన్ తర్వాతనే పోషకాహారం అందిస్తాం. ప్రభుత్వ సూచనల మేరకు దీనిని పూర్తిస్థాయిలో అమలులోకి తెస్తాం.

–జ్యోతి, సీడీపీఓ, దుమ్ముగూడెం ప్రాజెక్ట్

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి..

అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు మిషన్ పరివర్తన, నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు చేపట్టామని, డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని, ఆరోగ్యాన్నే కాకుండా సామర్థ్యాన్ని కూడా నశింపజేస్తాయన్నారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్ దక్షిణ ఫౌండేషన్ ద్వారా భద్రాచలంలో ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో హాట్‌స్పాట్ సెంటర్లను గుర్తించి అక్కడి నుంచి మాదక ద్రవ్యాలు ఇతర ప్రాంతాలకు రవాణా కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్, ఎక్సైజ్ శాఖలదే కాకుండా ప్రతి పౌరుడిపై ఉందన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన వారి వివరాలను టోల్ ఫ్రీ నంబర్ 14446కు ఫోన్ చేసి చెబితే తగిన సలహాలు, సూచనలు ఇస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం – ఆరోగ్యంపై ప్రభావం పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఐఈఓ వెంకటేశ్వర్లుతోపాటు అనసూయ, ఇందిర, సంజీవరావు, కరంచంద్, వరప్రసాద్, నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చర్ల: మండలంలోని కుదునూరు ప్రధాన రహదారి దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కుదునూరు గ్రామానికి చెందిన దొడ్డి లక్ష్మీనారాయణ (50) ఇంటి సమీపంలోని ప్రధాన రహదారి దాటుతున్న క్రమంలో భద్రాచలం వైపు నుంచి చర్ల వైపునకు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. తలకు తీవ్రగాయమైన లక్ష్మీనారాయణను స్థానికులు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. లక్ష్మీనారాయణకు భార్య సీత, ముగ్గురు కుమార్తెలు ఉండగా.. వారికి వివాహాలయ్యాయి. ప్రమాదంపై కేసు నమోదు కాలేదు.

జేసీబీ సీజ్

ములకలపల్లి: అటవీ ప్రాంతంలో పనులు చేస్తున్న జేసీబీ (చైన్ మిషన్)ని ఫారెస్ట్ అధికారులు సీజ్ చేశారు. ములకలపల్లి ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్ కథనం మేరకు.. మండలంలోని ముత్యాలంపాడు బీట్ పరిధిలోని అడవిలో చెట్లు తొలగిస్తున్నట్లు సమాచారం అందటంతో అధికారులు దాడి చేశారు. భూమి చదును చేస్తున్న జేసీబీని గుర్తించి, సీజ్ చేశారు. ఈ వాహనాన్ని తరలించేందుకు మరో వాహనం లేక అక్కడే ఉంచారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

టేకులపల్లి: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెగళ్లపాడు పంచాయతీ దుబ్బతండాకు చెందిన గుగులోత్ నాగేశ్ సోమవారం రాత్రి స్వగ్రామం నుంచి బైక్‌పై టేకులపల్లికి బయలుదేరాడు. సక్రుతండా సమీపంలో వెలుతురు సరిగా లేక రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నాగేశ్‌ను కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

‘ప్లాంటేషన్’ భూముల ఆక్రమణకు యత్నం



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రామన్నగూడెంలోని సర్వే నంబర్లు 30, 36, 39లో ఉన్న భూములను తమకు అప్పగించాలనే డిమాండ్‌తో సోమవారం స్థానిక గిరిజనులు అటవీ, ఎఫ్‌డీసీ ఆధీనంలో ఉన్న ప్లాంటేషన్ భూముల ఆక్రమణకు యత్నించారు. గిరిజనులంతా భూముల్లోకి చేరి నాలుగు గంటలపాటు బైఠాయించారు. ఆయా సర్వేనంబర్లలో ఉన్న సుమారు 573ఎకరాల భూములు తమ పూర్వీకుల నుంచి పూర్వపు హక్కు పట్టాలు కలిగి ఉన్నామని, హైకోర్టుతోపాటు నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ సర్వే చేసి గిరిజనులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. తాము అనేక దఫాలుగా భూములను అప్పగించాలని పోరాటాలు చేస్తున్నామని, ఈ నెల 12వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టామని, దీంతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి విస్మరించారని వివరించారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ డీఎం గణేశ్, ఎఫ్‌డీసీ రేంజర్ చంద్రకళతోపాటు అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి గిరిజనులతో చర్చించారు. తహసీల్దార్ రామకృష్ణకు సమాచారం అందించగా.. ప్రస్తుతం కలెక్టర్ అందుబాటులో లేరని మరో రెండు రోజుల గడువు కోరారు. చివరికి అధికారుల వినతితో గిరిజనులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ కంపెనీ పాలిటెక్నిక్ కళాశాల – నస్పూర్‌లో 2025 – 26 విద్యాసంవత్సరానికి గాను 300 అడ్మిషన్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సోమవారం తెలిపారు. సివిల్ – 60, కంప్యూటర్ – 60, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ – 60, మెకానికల్ – 60, మైనింగ్ – 60 సీట్లు ఉన్నాయని, పాలిసెట్‌లో అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు (150 సీట్ల కోసం) ఈ నెల 26 నుంచి జూలై 3 వరకుhttps:# scp. scpolytechniccom/ online& admission వెబ్‌సైట్ ద్వారా.. మిగిలిన సీట్ల కోసం ఇతరులు https:# tgpolycet. nic. inవెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకోసం 90102 22161, 87901 12515, 94911 44168 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి



డ్రైవింగ్ లైసెన్సులు పొందిన యువతతో పోలీసులు

గుండాల: గిరిజన ప్రాంతాల యువత అన్ని రంగాల్లో ముందుండాలని, భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని అడిషనల్ ఎస్పీ నరేందర్ ఆకాంక్షించారు. ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజన యువతను దృష్టిలో పెట్టుకుని పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశామని, అందులో భాగంగానే రవాణాశాఖ అధికారుల సహకారంతో మండలంలోని 100 మంది యువకులకు డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించామని చెప్పారు. గిరిజన యువతకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని, క్రీడాపోటీలు, వైద్యశిబిరాల నిర్వహణ, ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సాహం లాంటి కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని యువకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్, కానిస్టేబుల్ శంకర్‌ను అభినందించినారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, గుండాల సీఐ రవీందర్, ఎస్ఐ సైదా రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

30 డొమెస్టిక్ సిలిండర్ల సీజ్



సీజ్ చేసిన సిలిండర్లతో అధికారులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు కొత్తగూడెం, రామవరం, చుంచుపల్లిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కమర్షియల్‌కు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లు వాడు తుండగా.. వాటిని సీజ్ చేశారు. 15 హోటళ్లు, రెస్టారెంట్లలో 30 సిలిండర్లు సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి మహేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాల్వంచరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్ట్‌చేశారు. మండలంలోని బస్వతారకకాలనీలోని కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వెనుక గుట్టల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సురేశ్ సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. 9 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.16,500 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సువర్ణావకాశం



సాక్షి దినపత్రికకు పాలేరు, కొత్తగూడెం, ఇల్లందు ప్రాంతాలలో ప్రకటనలు సేకరించుటకు అడ్వర్‌టైజ్‌మెంట్ స్టాఫ్ కావలెను.

విద్యార్హత : 10th ఆపైన
19 సం॥లు ఆపైన వయస్సు వారై ఉండాలి.
ఆసక్తిగల అభ్యర్థులు బయోడెటా, విద్యార్హత జిరాక్స్ కాపీలు మరియు 1 లేటెస్ట్ పాస్‌పోర్ట్ ఫోటోతో సహా తేది: 26-06-2025 గురువారం ఉదయం గం॥ 10 నుండి మ॥ 1-00 గం॥ల మధ్య ఈ క్రింది అడ్రస్‌లో ఇంటర్వ్యూకు హాజరుకాగలరు.

సాక్షి తెలుగు దిన పత్రిక
తనికెళ్ళ గ్రామం,
కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా.
సెల్ : 9912220600

సాక్షి క్లాసిఫైడ్స్

Education

6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. సంప్ర ✆ 99895 30727 [SCA25005386]

Real Estate

FLAT FOR SALE

వరమహాలక్ష్మీ షాపింగ్ మాల్ ఎదురు రోడ్‌లో బైపాస్‌రోడ్ నుంచి 4వ స్థలం నందు 90% నిర్మాణం పూర్తి అయిన అపార్ట్‌మెంట్ నందు 3bhk, 2258 sft, తూర్పు ఫేసింగ్, 79 చ.గ.లు ల్యాండ్ షేర్, ప్రతి ఫ్లోర్‌కు 2 ఫ్లాట్స్ మాత్రమే, అన్ని బ్రాండెడ్ మెటీరియల్స్, ప్రీమియం కన్‌స్ట్రక్షన్ 99499 11636 [SCA 25005142]

Wanted

MG కార్ షోరూం ఖమ్మంలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్టు, మెకానిక్‌లు కావలెను. సం.ప్ర॥ సెల్ : 9491402020, 9492628629. [J-537]

రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 96032 03355, 92814 52843 [SCA25005423]

ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th – డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239 [SCA 25005435]

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No.1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్‌కై M/F వర్కర్స్ కా॥ భో+వ+జీ: 16–18 వేలు. 9515119570, 9553461177 [SCA25005422]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వాటాధనం నుంచి వాటా..

- సొసైటీలకు ఆరు శాతం డివిడెంట్‌గా చెల్లించేందుకు నిర్ణయం
- ఫలితంగా రూ.103 కోట్లలో రూ.6 కోట్లు అందే అవకాశం
- రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మం డీసీసీబీలో అమలు



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: సహకార బ్యాంకుల మనుగడకు మూలమైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)ల బలోపేతానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నడుం బిగించింది. సహకార వ్యవస్థలో కీలకమైన పీఏసీఎస్‌లకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వాటాధనంలో కొంత మేర చెల్లించాలని నిర్ణయించింది. సహకార సంఘాల సభ్యులకు డీసీసీబీ నుంచి ఏటా పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు మధ్య కాలిక, దీర్ఘ కాలిక రుణాలను ఇస్తున్నారు. ప్రతీ రుణంలో 10 శాతం వాటాధనాన్ని అప్పులో భాగంగా తమ వద్దే డిపాజిట్ చేస్తారు. ఇందులో నుంచి ఆరు శాతాన్ని డివిడెంట్ రూపంలో పీఏసీఎస్‌లకు అందించాలని డీసీసీబీ పాలకవర్గం తాజాగా నిర్ణయించింది. ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని ఖమ్మం జిల్లాలో 75, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 26, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో రెండేసీ పీఏసీఎస్‌లతో పాటు 176 వ్యవసాయేతర పరపతి సంఘాలు ఉన్నాయి. అంతేకాక బ్యాంకు 50 బ్రాంచ్‌లతో రూ.3,600 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. ఏటా సుమారు రూ.1,200 కోట్ల పంట రుణాలు, రూ.900 కోట్లు డిపాజిట్లు కొనసాగుతుండగా, వ్యవసాయ అవసరాలకే కాక బంగారు తాకట్టుపై, గృహ నిర్మాణం, వాహన, విద్య అవసరాలకు కూడా రుణాలు ఇస్తున్నారు.

డివిడెంట్‌గా ఆరు శాతం

సహకార సంఘాల ద్వారా అందించిన పంట రుణాలు, ఇతర మధ్య కాలిక, దీర్ఘ కాలిక రుణాల ద్వారా వాటాధనంగా రూ.103 కోట్ల నిధులు ఉన్నాయి. ఇందులో నుంచి ఆరు శాతం అంటే రూ.6 కోట్ల మేర సహకార సంఘాలకు డివిడెంట్ రూపంలో చెల్లించేలా తీర్మానించారు. ఈ నిధులతో సంఘాలు తిరిగి సంఘ సభ్యులకే లబ్ధి జరిగేలా ఖాతాల్లో అప్పు కింద జమ చేసుకునే అవకాశం ఉంది. లేదంటే దీర్ఘకాలిక అవసరాల కోసం గోదాంలు, కోల్డ్ స్టోరేజీలు నిర్మించే ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం.

100 సంఘాలకు ప్రయోజనం

వాటాధనం నుంచి ఆరు శాతం డివిడెంట్ రూపంలో డీసీసీబీ చెల్లిస్తుండగా, బ్యాంకు పరిధిలోని 100 సహకార సంఘాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. వాటాధనంగా జమ అయిన మొత్తం రైతులు తీసుకున్న పంట రుణాల ద్వారా సమకూరగా, ఆ వాటాధనం రైతులదే కావడంతో అన్నదాతలతో పాటు సహకార సంఘాలకు ప్రయోజనం కలిగేలా డీసీసీబీ పాలక వర్గం డివిడెంట్ చెల్లింపునకు నిర్ణయించింది.

తొలిసారి ఇక్కడే..

రాష్ట్రంలో తొమ్మిది డీసీసీబీలు ఉండగా, ఖమ్మం డీసీసీబీ మాత్రమే వాటాధనంలో ఆరు శాతాన్ని సహకార సంఘాలకు డివిడెంట్‌గా చెల్లించాలని నిర్ణయించడం విశేషం. 105 ఏళ్ల చరిత్ర కలిగిన డీసీసీబీ అనేక సంస్కరణలను తీసుకురాగా, ఒడిదుడుకులు, లాభ నష్టాలను అధిగమిస్తూ రైతులు, ఇతర వర్గాలకు అండగా నిలుస్తోంది. 2023 – 24 నుంచి బ్యాంకు లాభాల్లో పయనిస్తుండగా, 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో రూ.9.64 కోట్ల లాభాలు గడించింది. ఈ నేపథ్యాన బ్యాంకు మనుగడకు మూలమైన పీఏసీఎస్‌లకు ప్రయోజనం కలిగేలా వాటాధనం చెల్లింపునకు నిర్ణయం తీసుకుంది.

సొసైటీల బలోపేతమే లక్ష్యం



పీఏసీఎస్‌ల బలోపేతమే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేస్తున్నాం. బ్యాంకు ఎదుగుదలకు కీలకమైన పీఏసీఎస్‌ల నుంచి రైతులు తీసుకున్న రుణాల్లో వాటాధనం సేకరిస్తున్నాం. అందులో నుంచి ఆరు శాతం డివిడెంట్‌గా సంఘాలకు చెల్లించేందుకు పాలకవర్గం నిర్ణయించింది.

–ఎస్.వెంకటఆదిత్య, సీఈఓ, డీసీసీబీ

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

దుమ్ముగూడెం: మండలంలోని చిన్ననల్లబల్లి ఎంపీయూపీఎస్ హెచ్‌ఎం మోతుకూరి ప్రేమ్‌సాగర్ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి ఎంఈఓ సున్నం సమ్మయ్యతో పాటు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఇల్లెందు: స్టేషన్‌బస్తీకి చెందిన సురేశ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ హసీనా కథనం ప్రకారం.. బస్తీకి చెందిన బాలికతో సురేశ్ అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

దుమ్ముగూడెం: మండలంలోని గోవిందాపురంలో సవలం మల్లేశ్‌ను హత్య చేసిన నిందితుడు సవలం నాగేశ్వరరావును అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ సోమవారం తెలిపారు. పరారీలో ఉన్న నాగేశ్వరరావును కాటాయిగూడెం శివారులో అరెస్ట్ చేశామని, నిందితుడు ఉపయోగించిన కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

దొంగల హల్‌చల్

దుమ్ముగూడెం: మండలంలోని రామకృష్ణాపురం, లక్ష్మీనగరం గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. రామకృష్ణాపురంలోని బెల్టు దుకాణాల్లో చోరీలకు పాల్పడిన దుండగులు.. ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. దానిని లక్ష్మీనగరం గ్రామంలోని తాళ్లూరి ఆదినారాయణ ఇంటి వద్ద వదిలిపెట్టి అక్కడి బైక్‌ను అపహరించారు. లక్ష్మీనగరం గ్రామంలోని దుకాణంలో సైతం చోరీకి పాల్పడ్డారు. ఘటనా స్థలంలో ఓ ఐరన్ రాడ్‌ను వదిలేసి వెళ్లారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అట్రాసిటీ కేసులు నమోదు

దమ్మపేట/ఇల్లెందురూరల్: కులం పేరుతో దూషణకు పాల్పడ్డారని అందిన ఫిర్యాదుతో పలువురిపై పోలీసులు సోమవారం అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దమ్మపేట మండలంలోని నాగుపల్లికి చెందిన జీపీ వర్కర్ గుడా వెంకటేశ్వరరావు, అదే గ్రామానికి చెందిన కొందరు ఈనెల 17న నిర్వహించిన ఓ పంచాయితీకి హాజరయ్యారు. ఈ క్రమాన వేలివేల శ్రీనివాసరావు, మరో తొమ్మిది మందితో కలిసి గుడా వెంకటేశ్వరరావును కులం పేరుతో దూషించగా ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. అలాగే, ఎస్సీ మహిళను కులం పేరుతో దూషించాడన్న ఫిర్యాదు మేరకు ఇల్లెందు మండలం ఆజాద్‌నగర్‌కు చెందిన గుండ్లపల్లి శ్రీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి, తనను, కుమారుడిని చంపుతామని బెదిరించారంటూ చీమల విజయ ఫిర్యాదు చేయగా శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.